సాక్షి పెద్దపల్లి

బుధవారం । 25 । అక్టోబర్ । 2023

అమ్మవారికి పూజలు



గోదావరిఖని: దసరా పండుగ పర్వదినం సందర్భంగా స్థానిక జయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా చండీహోమంలో పాల్గొన్నారు. అనంతరం శమీపూజ చేశారు. నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

కమిషనరేట్‌లో ఆయుధపూజ



ఆయుధపూజ చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: విజయదశమి సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సీపీ రెమా రాజేశ్వరి మంగళవారం ఆయుధపూజ, వాహనపూజ చేశారు. దుర్గాదేవి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీస్థాయిలోని పోలీసు అధికారి, సిబ్బంది ప్రజా రక్షణలో ముందుంటూ ప్రజల మన్ననలు అందుకోవాలని ఆకాంక్షించారు. గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ మల్లికార్జున్, సీఐలు ప్రమోద్ రావు, చంద్రశేఖర్, వేణుగోపాల్, ప్రసాద్ రావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టోతో పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ప్రజలకు ఆమోదయోగ్యంగా బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉందని పేర్కొంటూ మంగళవారం దుర్గాదేవి అమ్మవారి వద్ద పత్రాలు ఉంచి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మండల రమేశ్‌గౌడ్, ఇంజపురి పులేందర్, నంది నగేశ్, కేపీ కుమార్, పల్లె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికీ మంచిదే విజయం



మాట్లాడుతున్న పుట్ట మధుకర్

యైటింక్లయిన్‌కాలనీ: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా రావణ దహనం (రాంలీలా) నిర్వహించడం ఆనవాయితీ అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. వైకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో సోమవారం రాత్రి జరిగిన రామ్‌లీలా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 12ఏళ్లుగా స్వచ్ఛంద సంస్థ వైకే ఫౌండేషన్ అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతోందని అభినందించారు. వైకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్, ఆర్జీ–2 ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, కార్తీక్, నిఖిల్, వేణుగోపాల్, రాకేశ్, రవీందర్, రాతు రమేశ్ పాల్గొన్నారు.

‘అవినీతి పాలనకు చరమగీతం పాడాలి’



ర్యాలీలో సంధ్యారాణి

గోదావరిఖని: రామగుండంలో అవినీతి పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి కోరారు. మంగళవారం స్థానిక 46వ డివిజన్ కాకతీయనగర్, ఎన్టీఆర్‌నగర్, రమేశ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. రామగుండంలో నోట్లకట్టల నాయకులకు, సామాన్య మహిళా నాయకురాలికి మధ్య పోరాటం జరుగుతోందన్నారు. రూ.కోట్లు ఖర్చు చేసి గెలవాలని కొందరు చూస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అనేక పరిశ్రమలతోపాటు దేశరక్షణలో ప్రధాని నరేంద్రమోదీ కీలకభూమిక పోషిస్తున్నారని తెలిపారు. ఈప్రాంత ఆడబిడ్డగా ఆదరించి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, మాతంగి రేణుక, షంషీర్, పాషా, రాజారాం, జనార్దన్, సంజీవ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కల్వచర్లలో నగదు పట్టివేత

రామగిరి: కల్వచర్ల శివారులో ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో మంథని మండలం లక్కేపూర్ గ్రామానికి చెందిన మంథని కిరణ్ అనే వ్యక్తి వద్ద రూ.99 వేల నగదు లభించింది. ఆధారాలు లేకపోవడంతో ఆ సొమ్ము సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



శమీపూజ చేస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి, మమతారెడ్డి



జ్యోతినగర్‌లో రావణ దహనం

దసరా వైభవం

పెద్దపల్లిరూరల్/కోల్‌సిటీ/జ్యోతినగర్: జిల్లాలో సోమ, మంగళవారాల్లో విజయదశమి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. శమీ, ఆయుధపూజలు చేశారు. రావణ దహనం కార్యక్రమానికి ప్రజలు భారీసంఖ్యలో హాజరయ్యారు. గోదావరిఖనిలో జరిగిన అకాడ విన్యాసాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జ్యోతినగర్‌లో కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు.



గోదావరిఖనిలో కళాకారుల అకాడ ప్రదర్శన

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

- సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం అన్నిఏర్పాట్లు చేస్తున్నామని రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. మంగళవారం కేంద్ర బలగాలు, సిబ్బందితో బ్రీఫింగ్ సెషన్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర బలగాల సేవలు వినియోగిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తర్వాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి భరోసా కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఫ్లాగ్‌మార్చ్, రూట్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీ టీంల డ్యూటీలు, ఎల్‌డబ్ల్యూ ఏరియాలో డామినేషన్, కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ విధుల గురించి వివరించారు. కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. చెక్‌పోస్టుల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్ పాల్గొన్నారు.



హాజరైన కేంద్ర పోలీసు బలగాలు



కోరుకంటి చందర్



సోమారపు సత్యనారాయణ



మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



కందుల సంధ్యారాణి



జనరల్ స్థానంలో ‘బీసీ’లదే హవా

వీలక్షణ తీర్పునకు పెట్టింది పేరు ఆ నియోజకవర్గం

- మూడు పర్యాయాలు బీసీదే విజయం
- ‘రామగుండం’ ఆవిర్భావం నుంచి ఇదే వరుస

సాక్షి, పెద్దపల్లి: రాష్ట్రంలో బీసీ నినాదం బలపడుతోంది. ఎమ్మెల్యే టికెట్ల కోసం బీసీ కులాలు గొంతెత్తుతున్నాయి. జనాభాలో తామెంతో.. అంతే శాతం సీట్లు కేటాయించాలని వివిధ రాజకీయ పార్టీలను డిమాండ్ చేస్తున్నాయి. అయితే.. రామగుండం నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి జనరల్ స్థానంలో ప్రధాన పార్టీలు బీసీ అభ్యర్థులకే అవకాశం కల్పిస్తున్నాయి. దీంతో బీసీల మధ్యే ఎన్నికల పోరు కొనసాగుతోంది. బీసీ నేతలు జనరల్ స్థానాన్ని తమ కంచుకోటగా మార్చుకుంటూ వస్తున్నారు. ఇప్పటిదాకా మూడు పర్యాయాలు ఎన్నికలు జరగ్గా.. మూడు సార్లు బీసీ ఎమ్మెల్యేలే గెలుపొందారు. ఓడిపోయే స్థానాల్లో కాకుండా ఇలా గెలిచే స్థానాల్లో బీసీలకు రాష్ట్రవ్యాప్తంగా కేటాయించాలని బీసీ వర్గాల నుంచి డిమాండ్ వస్తోంది.

రామగుండం అసెంబ్లీ ఆవిర్భావం నుంచి

- మేడారం నియోజకవర్గం నుంచి విడిపోయాక.. సింగరేణి కార్మిక క్షేత్రంగా ఉన్న గోదావరిఖనిని కలుపుకుని రామగుండం నియోజకవర్గంగా ఆవిర్భవించింది.
- ఒకప్పుడు మేడారం(ఎస్సీ)గా ఉన్న ఈప్రాంతం రామగుండం కార్పొరేషన్‌తో పాటు మూడు మండలాలతో కలిపి నియోజకవర్గాన్ని 2009లో పునర్విభజన చేసి రామగుండం (జనరల్)గా మార్చారు.
- తెలంగాణ రాష్ట్రానికే కొంగుబంగారంగా నిలిచిన సింగరేణి, ఎన్టీపీసీ, జెన్‌కో, కేశోరామ్ సిమెంట్, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలు ఈ నియోజకవర్గంలోని ప్రత్యేకతలు.
- ఇందులో పనిచేసే సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వారి కుటుంబాల ఓట్లు అభ్యర్థుల గెలుపోటములపై తీవ్రప్రభావం చూపిస్తున్నాయి.
- మొత్తం 2,08,127మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్ష మంది వరకు కార్మికులు, వారి కుటుంబాలే ఉన్నాయి.
- అయితే, నియోజకవర్గం జనరల్‌కు కేటాయించినప్పటికీ ఇక్కడి నుంచి పోటీపడే అభ్యర్థులు బీసీలే ఉండటం గమనార్హం.

ఈసారి పోటీపడుతున్న బీసీ ఎమ్మెల్యే అభ్యర్థులు

బీఆర్ఎస్	: కోరుకంటి చందర్ (మున్నూరుకాపు)
కాంగ్రెస్	: రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ (రాజ్‌పుత్)
బీజేపీ	: కందుల సంధ్యారాణి (పెరిక)
ఇండిపెండెంట్	: సోమారపు సత్యనారాయణ (మున్నూరుకాపు)

సింహం గుర్తుకు ఫుల్‌డిమాండ్

రామగుండం నియోజకవర్గంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) సింహం గుర్తుకు డిమాండ్ ఉంది. ఇక్కడ ప్రధాన పార్టీలతో పోల్చితే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన వ్యక్తి గెలుస్తాడని ప్రచారంలో ఉంది. బీజేపీ నుంచి టికెట్ దాదాపు ఖరారు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ తాజాగా బీజేపీకి రాజీనామా చేసి సింహం గుర్తుపై పోటీచేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



రాజ్‌ఠాకూర్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

- డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ గెలుపుతోనే ప్రతీపేద కుటుంబానికి న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్ అభయం ఇచ్చారు. స్థానిక లక్ష్మీనగర్ ఏరియాలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా వ్యాపారులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మక్కాన్‌సింగ్ ఠాకూర్ మాట్లాడారు. ఈప్రాంతాన్ని బొందల గడ్డగా చేసి ప్రజలు వలస పోయేలా సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే చేశారని ఆరోపించారు. లక్ష్మీనగర్‌లోని వ్యాపారులు అందరూ మున్సిపల్ కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో అత్యధికంగా చెల్లింపులు చేస్తున్నా.. కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని అన్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించడంలో కార్పొరేషన్ విఫలమైందని విమర్శించారు. తనను గెలిపిస్తే అసెంబ్లీలో ఈ ప్రాంత సమస్యలను ప్రస్తావించి రామగుండం ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుపుతానని అభయం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కల్యాణ్‌నగర్ రాజస్తాన్ భవన్‌లో దుర్గామాతను రాజ్‌ఠాకూర్ దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. 14వ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడిగా మొహిద్, ఉపాధ్యక్షుడిగా సిరాజొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ఇమ్రాన్ ఖాన్‌ను ఆయన నియమించారు.

కాంగ్రెస్‌లో చేరిక..

స్థానిక 14వ డివిజన్ ఎల్కలపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రాజ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఎండీ మొహిత్, ఖలీం, ఇమ్రాన్, సిరాజ్, అజీమ్, నసింబేగ్, మజీద్, మజర్, సమిద్, సజీద్, ఆసిఫ్, సాగర్, అబ్దుల్ ఖాదర్ తదితరులు ఉన్నారు.

చొప్పదండి.. స్థానికేతరులదేనండి!

- 1957లో శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు
- ఆరుసార్లు నియోజకవర్గేతరులదే విజయం
- రెండు దశాబ్దాలుగా గెలవని జాతీయ పార్టీలు
- టీడీపీ కంచుకోటకు బీటలు
- గోదావరి జలాలతో వాటర్ హబ్‌గా మారిన వైనం

ఓటర్ల వివరాలు

పురుషులు	1,11,197
మహిళలు	1,18,141
ఇతరులు	08
మొత్తం	2,29,346

చొప్పదండి: చొప్పదండి శాసనసభ నియోజకవర్గం 1957లో ఏర్పడింది. అప్పటినుంచీ స్థానికేతరులకు అడ్డాగా మారింది. అసెంబ్లీ ఎన్నికల బరిలో ప్రధాన పార్టీల తరఫున నియోజకవర్గేతరులు పోటీ చేయడం సర్వసాధారణమైంది. ఇప్పటివరకు పన్నెండు సార్లు ఎన్నికలు జరుగగా, ఆరుసార్లు స్థానికేతరులే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. పలుమార్లు ఓడిపోయిన అభ్యర్థులు కూడా స్థానికులు కాకపోవడం ఈ నియోజకవర్గ ప్రత్యేకత.

తొమ్మిది సార్లు రెండోస్థానమూ వారిదే

చొప్పదండి నుంచి 1957లో పీడీఎఫ్ తరఫున పోటీ చేసిన వేములవాడ మండలానికి చెందిన చెన్నమనేని రాజేశ్వర్‌రావు తొలిసారి ఎన్నికల్లో గెలుపొందారు. రెండోసారి 1962లో జరిగిన ఎన్నికల్లో బెజ్జంకి మండలానికి చెందిన బి.రాములు ఎన్నికయ్యారు. స్థానిక అభ్యర్థులుగా 1978లో న్యాలకొండ శ్రీపతిరావు, 1985 నుంచి వరుసగా మూడుసార్లు న్యాలకొండ రాంకిషన్‌రావులు మాత్రమే గెలిచారు. 1983లో పెగడపల్లి మండలానికి చెందిన గుర్రం మాధవ రెడ్డి, 1999లో కరీంనగర్‌కు చెందిన కోడూరి సత్యనారాయణగౌడ్, 2004లో వెల్గటూరు మండలానికి చెందిన సాన మారుతి విజయం సాధించారు. 2009లో అంతర్గాంకు చెందిన సుద్దాల దేవయ్య, 2014లో సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వరుల పల్లెకు చెందిన బొడిగె శోభ గెలుపొందారు. ఇక పన్నెండు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొమ్మిది సార్లు రెండో స్థానంలో నిలిచినవారూ స్థానికేతరులే కావడం కొసమెరుపు.

పునర్విభజనతో విచ్ఛిన్నం

నియోజకవర్గంలో ప్రధానంగా చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. పునర్విభజనకు ముందు కరీంనగర్ మండలంలో కొన్ని గ్రామాలు, వెల్గటూర్, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లో మరికొన్ని గ్రామాలు ఉండేవి. పునర్విభజన సమయంలో చొప్పదండి, రామడుగు, గంగాధరతోపాటు కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి మండలాలను చొప్పదండిలో కలిపారు. ఇక తెలంగాణ వచ్చాక నూతన జిల్లాల ఏర్పాటు సమయంలో చొప్పదండి నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేశారు. ప్రస్తుత కరీంనగర్ జిల్లాలో మూడు మండలాలు ఉండగా, బోయినపల్లి మండలాన్ని రాజన్నసిరిసిల్ల జిల్లాలో, కొడిమ్యాల, మల్యాల మండలాలను జగిత్యాల జిల్లాలో కలిపి, నియోజకవర్గ స్వరూపాన్ని మార్చేశారు.

జీవనోపాధికి వలసలే మార్గం

మెట్ట ప్రాంతమైన చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు దశాబ్దాలుగా జీవనోపాధి నిమిత్తం వలసలు వెళ్లడమే ఏకైక మార్గం. బొంబాయి, భీవండితోపాటు దుబాయి, అబుదాబి, సౌదీ అరేబియా, మస్కట్, దోహా ఖతార్ తదితర దేశాలకు వెళ్తున్నారు. మెజారిటీ గ్రామాలు మెట్ట ప్రాంతంలో ఉండటంతో ఏటా వర్షాలపై ఆధారపడి పంటలు వేయడం, అవి చేతికి వచ్చే సమయంలో వర్షాభావంతో ఎండిపోవడం, లేదా దిగుబడి తగ్గుతున్న దుస్థితిని ఇక్కడి రైతులకు ఎదుర్కొంటున్నారు.

వరద కాలువతో పెను మార్పు

అర్ధ శతాబ్దం క్రితం నిర్మించిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ తవ్వకంతో చొప్పదండి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగునీరందేది. ఆపై కాలువల తవ్వకం లేకపోవడంతో సాగునీటి కోసం రైతులు పోరాటాలు చేసేవారు. తన పాదయాత్రలో వారి కష్టాలను ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వరద కాలువ నిర్మాణం పూర్తి చేశారు. ఇది ఎక్కువగా ఈ నియోజకవర్గంలోనే విస్తరించి ఉంది. ఈ కాలువకు తోడు ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించి పైప్‌లైన్ ద్వారా నారాయణపూర్ ప్రాజెక్టుకు నీటిని తరలించే పనులను, మిడ్ మానేరు నిర్మాణానికి భూసేకరణను వైఎస్సార్ హయాంలోనే పూర్తి చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత చివరి దశ పనులు జరిగి, చొప్పదండి వాటర్ హబ్‌గా మారింది. లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్, బోయిన్‌పల్లి మండలంలో నిర్మించిన మిడ్ మానేరు ప్రాజెక్టు, మల్యాల నుంచి బోయినపల్లి వరకు నిర్మించిన వరద కాలువ ప్రస్తుతం నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో బావుల ద్వారా వ్యవసాయం చేసేలా పరిస్థితి మారింది.

ప్రభావం చూపే అంశాలు

- నియోజకవర్గంలోని ఓటర్లలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఇక్కడి ప్రజలకు వ్యవసాయమే ఆధారం. చాలీచాలని ఆదాయంతో చేనేత, మరమగ్గాల కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ప్రతీసారి విలక్షణ తీర్పు ఇవ్వడం ఈ నియోజకవర్గ ఓటర్ల ప్రత్యేకత. తెలంగాణ రాకముందు పదిసార్లు శాసనసభ ఎన్నికలు జరగగా ఆరు సార్లు టీడీపీ, నాలుగు సార్లు ఇతరులు గెలుపొందగా, తెలంగాణ వచ్చాక టీడీపీ కంచుకోటకు బీటలు వారాయి. ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో రెండుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారు. గడిచిన ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి మళ్లీ గెలవకపోవడం, రెండు దశాబ్దాలుగా జాతీయ పార్టీలను గెలుపుతీరాలకు చేర్చకపోవడం, ప్రాంతీయ పార్టీలనే అక్కున చేర్చుకోవడం వంటివి చొప్పదండి విశేషాలు.



గెలుపు, ఓటముల వివరాలు

ఏడాది	గెలిచిన అభ్యర్థి	పోలైన ఓట్లు	ఓడిన అభ్యర్థి	పోలైన ఓట్లు
1957	రాజేశ్వర్‌రావు (పీడీఎఫ్)	99,074	బి.రాములు (కాంగ్రెస్)	8,054
1962	బి.రాములు (కాంగ్రెస్)	15,749	ఆర్.రెడ్డి (స్వతంత్ర్య)	8,216
1978	ఎన్.శ్రీపతిరావు (కాంగ్రెస్.ఐ)	26,311	ఎం.కృష్ణారెడ్డి (కాంగ్రెస్)	20,054
1983	జి.మాధవరెడ్డి (టీడీపీ)	36,133	ఏఎస్.రెడ్డి (కాంగ్రెస్)	18,651
1985	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	55,141	బండారి రామస్వామి (కాంగ్రెస్)	13,704
1989	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	47,783	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	39,921
1994	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	56,287	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	30,600
1999	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	54,754	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	52,842
2004	సాన మారుతి (టీడీపీ)	45,211	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	41,096
2009	సుద్దాల దేవయ్య (టీడీపీ)	68,841	గునుకొండ బాబు (కాంగ్రెస్)	35,853
2014	బొడిగె శోభ (టీఆర్ఎస్)	86,841	సుద్దాల దేవయ్య (కాంగ్రెస్)	31,860
2018	సుంకె రవిశంకర్ (టీఆర్ఎస్)	91,090	మేడిపల్లి సత్యం (కాంగ్రెస్)	48,963

క్లుప్తంగా

గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే



గాయపడిన మహిళ వద్ద ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ప్రమాదంలో గాయపడిన మహిళను దగ్గరుండి ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్. మంగళవారం స్థానిక రాజేశ్ థియేటర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఓ మహిళ గాయపడ్డది. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే చందర్.. తన వాహనం ఆపి మహిళ వద్దకు వెళ్లారు. ఆమె క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. దగ్గరుండి కారులో ఆస్పత్రికి పంపించారు.

రైతు ఆత్మహత్య

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మండలం చిన్నకొవిఎర గ్రామానికి చెందిన రైతు పచ్చిక రవీందర్ రెడ్డి(35) మంగళవారం సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి తనకున్న మూడు ఎకరాల్లో ఈ వానాకాలంలో వరి పంట వేశాడు. పంట ప్రస్తుతం కోతదశకు చేరింది. అయితే, ఏమైందో ఏమోకానీ, మంగళవారం సాయంత్రం ఇంటివెనుకాలకు వెళ్లి గడ్డివాములో నిల్వచేసిన పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు చూసి వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావడంలేదు. మృతుడికి భార్య సాత్విక, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైతు ఆత్మహత్యపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సదయ్య(ఫైల్)

రామగిరి: లొంకకేసారం గ్రామానికి చెందిన కారు పాకల సదయ్య(40) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సదయ్య దసరా పండుగ సందర్భంగా సోమవారం తన అత్త గారింటికి బేగంపేటకు వెళ్తుండగా.. పన్నూర్ క్రాస్ రోడ్ వద్ద గుర్తుతెలియని ఆటో ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం గోదావరిఖని ఏరియా అసుపత్రికి తరలించగా.. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, కూతుళ్లు హర్షిత(12), సాహితి ప్రియ(8) ఉన్నారు. మృతుడి తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తునట్టు ఎస్సై రవిప్రసాద్ తెలిపారు.

27న యోగా పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో ఈ నెల 27న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 14, 17, 19, బాలబాలికల యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, సీహెచ్.జనార్దన్‌రావు తెలిపారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించిన బాలబాలికలు సంబంధిత అర్హత ధ్రువపత్రాలతో ఉదయం 10గంటలకు స్పోర్ట్స్ స్కూల్‌లో జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్‌కు రిపోర్టు చేయాలన్నారు.

ఒక బోర్డు.. నాలుగు స్తంభాలు

- క్రీడాప్రాంగణాల్లో కనిపించేవి ఇవే..
- పిచ్చిమొక్కలతో నిండి అధ్వానం
- ఆటలు ఆడేదెలా?
- అభివృద్ధి చేయాలంటున్న క్రీడాకారులు జిల్లాలో పరిస్థితి



'ఈ ఫొటోలో కనిపిస్తున్నది పెద్దపల్లి మున్సిపల్ శివారు అప్పన్నపేట వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం. శ్మశానవాటికను ఆనుకొని ఉన్న కొద్దిపాటి స్థలంలో ఒక బోర్డు, నాలుగు ఇనుప స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇందులో ముళ్ల తుప్పలు, పిచ్చి మొక్కలు మొలిచాయని, ఆటలు ఆడేదెలా అని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. క్రీడలకు అనువుగా ఉండేలా మైదానాలను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.' ఇది ఈ ఒక్క చోటే కాదు.. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడా మైదానాల పరిస్థితి.



స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని జిల్లాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది. పెద్దపల్లి జిల్లాలోని మైదానాల కోసం 267 పంచాయతీలకు 268, నాలుగు మున్సిపాలిటీలకు 14, కలెక్టరేట్‌కు 30 స్పోర్ట్స్ కిట్లను సరఫరా చేయగా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అందజేశారు.

ఆగమేఘాల మీద ఏర్పాటు..

ఊరికో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సర్కారు ఆగమేఘాల మీద స్థలాలను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఉన్నతాధికారుల మెప్పు పొందేందుకు అనువుగా ఉన్నా.. లేకున్నా ఓ బోర్డు, నాలుగు స్తంభాలను ఏర్పాటు చేసి, చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు క్రీడాప్రాంగణాలున్న ప్రాంతాలన్నీ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.

నిరుపయోగంగా మారనున్న కిట్లు

అనువైన ఆట స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వం ఇటీవల పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్లు నిరుపయోగంగా మారనున్నాయి. కొన్ని పంచాయతీల్లో పాఠశాలల ఆవరణలోని మైదానాల్లో ఆడుకుంటుండగా చాలావరకు కిట్లను పంచాయతీల బీరువాల్లో దాచినట్లు సమాచారం. క్రికెట్, వాలీబాల్, జిమ్, డిస్కస్‌త్రో, టెన్నికాయిట్ రింగ్, స్కిప్పింగ్ రోప్ తదితర సామగ్రితో కూడిన కిట్లను సర్పంచ్‌లు, కార్యదర్శులకు అప్పగించారు.

పంచాయతీవారిదే బాధ్యత



ప్రభుత్వం సరఫరా చేసిన స్పోర్ట్స్ కిట్లను పంచాయతీలు, మున్సిపాలిటీలకు అందించాం. క్రీడాప్రాంగణాల నిర్వహణ బాధ్యతలను గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, పంచాయతీవారే చూస్తారు. మైదానాలను ఆటలకు అనువుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటారు.

– సురేశ్, డీవైఎస్‌వో

అలయ్.. బలయ్..

- ఊరూరా దసరా ఉత్సవాలు
- శమి చెట్టుకు పూజలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో దసరా పర్వదిన వేడుకలను సోమవారం జరుపుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శమి చెట్టును ఉంచి పూజలు చేశారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి పూజల్లో పాల్గొని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. జెండా ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు శమి చెట్టుకు పూజలు చేసి అలయ్.. బలయ్ తీసుకొని శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఊరూరా దసరా పర్వదిన వేడుకలను జరుపుకున్నారు.



పెద్దపల్లిలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

చెడుపై విజయానికి ప్రతీక దసరా



రావణాసుర దహన కార్యక్రమంలో పుట్ట మధు

రామగిరి: చెడుపై మంచి విజయానికి ప్రతీకగా నిలిచే దసరా వేడుకలు ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. సోమవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సెంటినరీకాలనీ రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో రాంలీల కార్యక్రమంలో పాల్గొని రావణాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఆర్జీ–3 డివిజన్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, సర్పంచులు అల్లం పద్మ, పల్లె ప్రతిమ, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, నాయకులు పూదరి సత్యనారాయణగౌడ్, బూరుగు రాజుగౌడ్, బంక్ మల్లేశ్, బండ శ్రీనివాస్, ఇసంపల్లి రమేష్, దేవ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సంబరాలు

విజయదశమిని పురస్కరించుకొని సోమవారం మండలంలో సంబరాలు ఘనంగా జరిగాయి. శమి పూజ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంత్రపురిలో ఘనంగా విజయదశమి వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, జిల్లాపరిషత్ చైర్మన్ పుట్ట మధు



దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: దసరా వేడుకలను మంథని డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. మంత్రపురి దేవాలయాల్లో డివిజన్ ప్రజలు ప్రత్యేక పూజలు చేసారు. గోదారంగనాయక లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. స్థానికంగా కోర్టు ఎదుట ఉన్న జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. డివిజన్‌లోని ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లాపరిషత్ చైర్మన్ పుట్ట మధు దంపతులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు దుర్గామాతను దర్శించుకున్నారు. స్వామివారి శోభాయాత్రలో పుట్ట మధు దంపతులు పాల్గొని దర్శించుకున్నారు. తన నివాసంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో కల్సి పుట్ట మధు సంహపంక్తి భోజనం చేశారు.

'అకాడ' అదుర్స్

- 'ఖని'లో ఉత్సాహంగా వేడుకలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో దసరా పండుగను పరస్కరించుకొని సోమవారం స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన జై భారత్ హనుమాన్ అకాడ వస్తాద్ మచ్చ శంకర్ బృందం నిర్వహించిన అకాడ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తలపై కొబ్బరికాయ పగలగొట్టడం.. దవడ కింద పెట్టిన అరటి పండును తల్వార్‌తో కట్ చేయడం.. మంటలతో కర్రసాము చేయడం లాంటి ఒళ్లు గగుర్పొడిచే విరోచితమైన విన్యాసాలు చేశారు. కత్తులు, కర్రలు, కాంద, బర్చి, డాల్, తల్వార్లు, రంపెలు, బీచ్‌వాలు, కాందాలు, ట్యూబ్‌లైట్లతో ఫైట్, కండ్లకు గంతలు కట్టుకొని కర్రసాము, దుశ్మన్‌ఫైట్, రంగ్ బాన్, స్టార్స్, గొడ్డళ్లు, పట్టా, పంజా తదితర ఆయుధాలతో కళాకారుల కళా ప్రదర్శనలు అబ్బురపరిచాయి. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అకాడ ప్రదర్శనలను ప్రారంభించి ఆయుధాలను పట్టుకొని కళాకారుల్లో ఉత్సాహం నింపారు. ఎమ్మెల్యే బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థిని కందుల సంధ్యారాణి కర్రసాము విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అకాడను తిలకించడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, బీజేపీ ధర్మపురి అభ్యర్థి ఎస్.కుమార్ వేర్వురుగా సందర్శించి నిర్వాహకులను అభినందించారు. అకాడను బతికించడానికి 40 సంవత్సరాలుగా ప్రదర్శనలు చేస్తున్నట్లు వస్తాదులు మచ్చ శంకర్, మచ్చ విశ్వాస్ తెలిపారు. శ్రీకోదండ రామాలయంలో మజీ ఎమ్మెల్యే మాలేం మల్లేశం భార్యను జై భారత్ హనుమాన్ అకాడ వస్తాదులు శాలువాతో సన్మానించారు.



కర్రసాము చేస్తున్న కందుల సంధ్యారాణి



జ్యోతినగర్: అకాడ ప్రదర్శన

మేడిపల్లి సెంటర్‌లో..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో సోమవారం రాత్రి హనుమాన్ అకాడ ప్రదర్శన వైభవంగా జరిగింది. కంది రాజయ్య అకాడ వస్తాద్ జ్ఞాపకార్థం వారి కుమారుడు కంది నాగరాజు నిర్వహించిన అకాడ ప్రదర్శనను స్థానిక కార్పొరేటర్లు ఎన్వీ రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్ ప్రారంభించారు. కర్ర, కత్తిసాము, స్టార్, డాలు, బల్లెం ప్రదర్శనలు చిలుకలయ్య దేవాలయం వరకు కొనసాగాయి. కంది చంద్రయ్య, వెంకటేషం, ముత్యాల సాదిరాం, సాగర్, శ్రీనివాస్, విశ్వభారతి హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు వంగల కిషన్‌గౌడ్ మంగళవారం తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడగా.. తోటి గీత కార్మికులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ అనూష, మాజీ సింగిల్‌విండో చైర్మన్ రమేష్ కోరారు.

యూఎస్‌ఏలో బతుకమ్మ సంబరం




కాల్వశ్రీరాంపూర్: తెలంగాణ ఆటాపాట దేశం ఎల్లలు దాటి ఖండాంతరాలకు వ్యాపించింది. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి మధుమిత సాయిరాం దంపతుల కూతురు శ్రీనికకు బతుకమ్మ పాటలు, ఆటలు నేర్పుతున్న ఫొటో అందరినీ ఆకర్షించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన కాళ్ల అరుణ లింగమూర్తి దంపతుల కూతురు హారిక నార్త్ కరోలినా పట్టణంలో బతుకమ్మ ఆడుతూ అలరించారు. బతుకమ్మ పండుగ అంటే చాలా ఇష్టమని హారిక పేర్కొంది.



చీకటి ప్రయాణం.. తీరేదెన్నడో..?

వెలుగులు లేక చీకట్లో ప్రయాణాలు చేస్తూ అవస్థలు పడుతున్నారు వాహనదారులు. గుంతలెక్కడున్నాయో తెలియక, ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురులో రోడ్డు సరిగా కనిపించక పాలకులపై విమర్శలు గుప్పిస్తున్నారు. పెద్దపల్లి పట్టణం నుంచి మంథని దారి బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ఏళ్ల గడిచినా.. పాలకులు మారినా.. కనీస వసతుల్లేక చిమ్మ చీకట్లో ప్రయాణాలు సాగించాల్సి వస్తోందంటున్నారు ప్రయాణికులు. ఇప్పటికైనా వీధి దీపాలు అమర్చితే సౌకర్యంగా ఉంటుందంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



బొగ్గు బాయి

రక్షణపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: రక్షణ చర్యలపై ప్రతీనిమిషం అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం రక్షణపై సమీక్షించారు. ఈనెల 26 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు వరకు 54వ రక్షణ పక్షోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికోసం తనిఖీ బృందం అన్నిగనులు, డిపార్ట్‌మెంట్లకు రానున్నాయని తెలిపారు. సింగరేణిలో రక్షణపై ప్రతీఉద్యోగికి అవగాహన కల్పించాలన్నారు. అందరూ తప్పనిసరిగా బూట్లు, టోపీ ధరించి విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, మేనేజర్లు, రక్షణ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సింగరేణికి రక్షణ

అధికార ప్రతినిధి మాదాసు రాంమూర్తి



మాట్లాడుతున్న రాంమూర్తి

గోదావరిఖని: సింగరేణి సంస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుతోందని ఆ పార్టీ అధికార ప్రతినిధి మాదాసు రాంమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే కారుణ్య నియామకాల ద్వారా 16వేల మంది యువలకు సంస్థలో ఉద్యోగాశాలు దక్కాయన్నారు. లేకుంటే 2023 నాటికి సింగరేణిలో కార్మికుల సంఖ్య 20వేలకు తగ్గేదన్నారు. అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు, రామగుండం ఎరువుల కర్మాగారం మూసివేతకు కాంగ్రెస్ పార్టీ కారణమని ఆరోపించారు. గోల్డెన్ హ్యాండ్‌షేక్ స్కీం పేరిట 20వేల మంది కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించిందన్నారు. జీడీకే–5 ఓసీపీ ఏర్పాటు కావాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ లేఖ ఇచ్చింది నిజం కాదా? అన్ని ప్రశ్నించారు. కమీషన్లకు కక్కుర్తిపడి దేశంలోని బొగ్గు బ్లాకులను బడా కాంట్రాక్టర్లకు కట్టబెట్టిందని కాంగ్రెస్ పార్టీయే అని ఆయన ధ్వజమెత్తారు. సింగరేణి కార్మికులు, ప్రజల కోసం పనిచేసే బీఆర్‌ఎస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో ఆదరించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు తోడేటి శంకర్‌గౌడ్, పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్‌రావు, పర్లపల్లి రవి, మెతుకు దేవరాజు, చల్లగురువుల మొగిలి, రత్నాకర్‌రావు, జక్కుల తిరుపతి, నిట్టూరి రాజు, సంతోష్, సతీశ్, ఈదునూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కేంద్రం మూసివేతకు కుట్ర

కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి



మాట్లాడుతున్న మహంకాళి స్వామి

రామగుండం: పట్టణంలోని బీ థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేతకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి ఆరోపించారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పునరుద్ధరణ పనులకు అధికారులు రూ.3కోట్లు వెచ్చించినా.. మూడురోజుల్లో విద్యుత్ కేంద్రం మంటలకు ఆహుతైందని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులపై వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే తరహా ప్రమాదం శ్రీశైలం ప్రాజెక్టులో చోటుచేసుకుని 12 మంది ఇంజినీర్లు, తమిళనాడులో 32 మంది మృతిచెందారని తెలిపారు. బీ థర్మల్ మంటల్లో కాలిపోతుంటే ఎమ్మెల్యే, మేయర్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. పైగా ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుపైనే కసరత్తు చేస్తుండడం దురదృష్టకరమన్నారు. గతంలోనే డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ ఆధ్వర్యంలో రామగుండం కేంద్రంగా 1,200 మెగావాట్ల రెండు విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు స్థాపించాలని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. విద్యుత్ కేంద్రం మూసివేతతో ఉద్యోగులకు నష్టం లేదని, కానీ దానిపై ఆధారపడి జీవిస్తున్న స్థానిక చిరువ్యాపారులు బజారున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వనరులులేని యాదాద్రిలో విద్యుత్ కేంద్రం స్థాపించి కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. స్థానికంగా వనరుల లభ్యతతో నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకే ఉత్పత్తి చేయవచ్చని అన్నారు. రామగుండంలో కొత్త విద్యుత్ కేంద్రం స్థాపన అంశాన్ని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచేందుకు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రతినిధులు సలీంబేగ్, నస్రీన్ బేగం, ఇసంపెల్లి అంజులు, సిరిశెట్టి సతీశ్, ఓదెల రాజమౌళి, సాదు రమేశ్, బుగ్గ రాములుగౌడ్, యాసిన్, మోయిన్, సింగం కిరణ్‌గౌడ్, బల్వన్‌సింగ్, తార, అనిత పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సంస్థ మినీ భారత్



రావణ దహనం ప్రారంభిస్తున్న కేదార్ రంజన్

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ మినీ భారత్ అని, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నట్లు రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. సోమవారం రాత్రి విజయదశమి పండుగ సందర్భంగా పర్మనెంట్ టౌన్‌షిప్ జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ లలిత కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. శారద యక్షగాన బృందం చేసిన యక్షగానం అలరించింది. ఫైర్ వర్క్స్ వారు ఏర్పాటు చేసిన రావణ దహనాన్ని సీజీఎం ప్రారంభించారు. బాణసంచా పేలుళ్లు ఆకట్టుకున్నాయి. ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్‌తో పాటు ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగ గుర్తింపు సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జమాతే ఇస్లామి హింద్ ఏ పార్టీకి మద్దతు ప్రకటించలేదు



మాట్లాడుతున్న అబ్దుల్ మజీద్ షోయబ్

రామగిరి: జమాతే ఇస్లామి హింద్ ఏ రాజకీయ పార్టీకి మద్దతు ప్రకటించలేదని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయబ్ అన్నారు. సోమవారం సెంటనరీకాలనీలో ఖ్వాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామి అధ్యక్షతన మస్జీద్ ఆల్ కౌసర్‌లో మిల్లె ఇత్తెహద్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో ఇంకా ఏ పార్టీకి మద్దతు ప్రకటించలేదని, కొన్ని వార్త పత్రికలు, సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు వస్తున్నాయన్నారు. ఎన్నికల సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు కలుస్తుంటారని, మా సిద్ధాంతపరంగా మా సమస్యలు పరిష్కరించి న్యాయం చేసే పార్టీకి మద్దతు ప్రకటిస్తామన్నారు. మద్దతుపై పూర్తి నిర్ణయాన్ని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ప్రతినిధులు మౌలానా రఫీక్, జేబీ హఫీజ్ సలీమ్, మౌలానా మున్వార్ ఆలీ, హఫీజ్ అహ్మద్ మెయినుద్దీన్, అబ్దుల్ సత్తార్, మొహమ్మద్ ఫసీయుద్దీన్, మొహమ్మద్ ముస్తాఫా, మొహమ్మద్ అక్రముద్దీన్, మొహమ్మద్ ఖాజా మోయినుద్దీన్, మాక్సూద్ అహ్మద్ ఖాన్, మౌలానా జమీల్ పాల్గొన్నారు.

ఉన్ని వస్త్రాల స్టాల్స్ ప్రారంభం



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీచౌక్ చౌరస్తాలో ఇండోటిబేటియన్స్ వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన ఉన్ని వస్త్రాల స్టాల్స్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించారు. ఏ ప్రాంత వ్యాపారస్తులనైనా అక్కున చేర్చుకునే సంస్కృతి రామగుండం నియోజకవర్గానిదని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో నాయకులు తానిపర్తి గోపాల్‌రావు, మాదాసు రామమూర్తి, దయనంద్ గాంధీ, ఇండోటిబేటియన్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



మల్లేశ్‌ను ఆహ్వానిస్తున్న ఎంఎస్ ఠాకూర్

యైటింక్లయిన్‌కాలనీ: పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు కుంట్ల మల్లేశ్ యాదవ్ సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆయనకు పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కార్పొరేటర్ శంకర్ నాయక్, పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, నాయకులు చక్రపాణి, దుర్గాప్రసాద్, రాజేశం, కిషన్ నాయక్, రాములు, మార్క రాజు అవినాశ్ పాల్గొన్నారు.

శమీపూజలో రాజ్‌ఠాకూర్

గోదావరిఖనిటౌన్: స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లో కాంగ్రెస్ రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ శమీపూజలు చేశారు. కార్పొరేటర్ పెద్దెల్లి తేజశ్విని, నాయకులు గుడికందుల రవి, కందునూరి రామస్వామి, బొమ్మ ప్రభాకర్‌గౌడ్, తాత రాజేశం, గుండబోయిన సదానందం, దాసరి కొమురవ్వ, మద్దెల మల్లేశ్, ముత్తూరి కనుకమ్మ తదితరులు పాల్గొన్నారు.